క్లుప్తంగా

3న టీఎల్ఎం ప్రదర్శన

చిట్యాల : పట్టణంలోని ముప్ప మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 3వ తేదీన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా టీఎల్ఎం(బోధనాభ్యసన సామగ్రి) ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి సీహెచ్.నరసింగరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన కొండేటి మల్లయ్య


రేవంత్‌రెడ్డికి బొకే అందిస్తున్న కొండేటి

నకిరేకల్ : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని, మాజీ మంత్రి జానారెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య కలిసి నూతన సంవత్సర శుభాంక్షలు తెలిపారు.

ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన శంకర్‌నాయక్


ఎస్పీకి బొకే అందజేస్తున్న శంకర్‌నాయక్

నల్లగొండ : నూతన సంవత్సరం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆదివారం నల్లగొండలో ఎస్పీ రెమా రాజేశ్వరిని కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సద్దాం, అంజినాయక్ తదితరులు ఉన్నారు.

కల్లుపై నిషేధాన్ని ఎత్తివేయాలి

మర్రిగూడ : కర్నాటక రాష్ట్రంలో కల్లును నిషేధించడం దుర్మార్గమని గీతపనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తి నిషేధంతో సుమారు 70లక్షల గౌడన్నల జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కల్లుపై నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి అయితగోని జంగయ్య గౌడ్, మిద్దె జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

అన్నదాన సత్రం కమిటీలో నార్కట్‌పల్లివాసులకు చోటు


నిమ్మనగోటి వెంకన్న


సత్యనారాయణ


మిడిదొడ్డి రాజు

నార్కట్‌పల్లి : శ్రీశైలంలోని అఖిల భారత శ్రీశైల కుమ్మర శాలివాహన నిత్య అన్నదాన సత్రంలో జరిగిన ఎన్నికల్లో నార్కట్‌పల్లి మండలానికి చెందిన ముగ్గురికి అవకాశం దక్కింది. సత్రం సంయుక్త కార్యదర్శిగా నార్కట్‌పల్లికి చెందిన బండారు సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా శాపల్లి గ్రామానికి చెందిన నిమ్మనగోటి వెంకన్న, కార్యవర్గ సభ్యుడిగా అమ్మనబోలు గ్రామానికి చెందిన మిడిదొడ్డి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు ఆదివారం నార్కట్‌పల్లిలో మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన సత్రం అధ్యక్షుడు బండారు భిక్షపతి, రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షుడు నడికుడి జయంత్ రావు, ప్రధాన కార్యదర్శి మల్కజిగిరి దయానంద్, ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి రాధారపు భిక్షపతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

రిజిస్ట్రేషన్ల మార్పిడిపై అవగాహన

రామగిరి(నల్లగొండ) : ఎంఐఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం రిజిస్ట్రేషన్ మార్పిడిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.రజియుద్దీన్ పాల్గొని మాట్లాడుతూ పాత ఇళ్ల పట్టాలను పూర్వికుల నుంచి తమ పేరు మీద మార్చుకోవాలని సూచించారు. నల్లగొండ పాతబస్తీలో ఇంటి పట్టాలు పూర్వికుల పేరు మీద ఉన్నాయని, దీనివల్ల రిజిస్ట్రేషన్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రఫీయుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మోయిన్, గౌస్, అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎండీ రజియుద్దీన్

'రేషన్' కోసం తప్పని తిప్పలు!

- పక్క గ్రామాలకు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్న లబ్ధిదారులు
- కొత్త దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు గతంలో ప్రకటించిన అధికారులు
- నేటికీ ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు


జక్కలవారిగూడెం నుంచి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్న రావిగూడెం గ్రామస్తులు

మునుగోడు : నూతన గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటు కోసం ప్రజలు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. అయితే ఆయా గ్రామాల ప్రజల ఆశలు మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక పుణ్యమా అని నెరవేరేలా కనబడింది. ఉప ఎన్నికకు ముందు కొత్త పంచాయతీలకు రేషన్ దుకాణాలు మంజూరు చేసినట్లు అధికారులు ప్రకటించారు. కానీ నేటికీ దుకాణాలను ప్రారంభించలేదు. దీంతో రేషన్ దుకాణాల ఏర్పాటు ప్రకటనలకే పరిమితమా అనే సందేహాలు ఆయా గ్రామాల ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ఆగస్టు 30న ప్రకటించిన అధికారులు..

మునుగోడు మండలంలోని 4 గ్రామాలతోపాటు నియోజకవర్గ పరిధిలోని చండూరు మండలంలో 2 గ్రామాల్లో రేషన్ దుకాణాలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఆగస్టు 30వ తేదీన ప్రకటించారు. మంజూరైన వాటిలో మునుగోడు మండలంలోని గుండ్లోరిగూడెం, గంగోరిగూడెం, బీరేల్లిగూడెం, రావిగూడెం గ్రామాలు, చండూరు మండలంలోని గొల్లగూడెం, శేరిగూడెం గ్రామాలు ఉన్నాయి. ప్రకటన వచ్చిన వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల కార్డుల సంఖ్యతోపాటు లబ్ధిదారుల సంఖ్యను జిల్లా అధికారులకు అందించారు. కానీ నేటికి రేషన్ దుకాణాలను కొత్త గ్రామపంచాయతీల్లో ప్రారంభించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గతంలో వలె పక్కనే ఉన్న గ్రామాలకు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నారు. కొందరి యువకులు ద్విచక్రవాహనాలపై బియ్యం తెచ్చుకుంటున్నారు. వృద్ధులు మాత్రం బియ్యం తెచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నూతన పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు



మా గ్రామంలో రేషన్ దుకాణం లేదు. పక్క గ్రామంలో ఉన్న దుకాణం వద్దకు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకునేందుకు వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు గత ఆగస్టులో ప్రకటించిన ప్రకారం వెంటనే మా గ్రామంలో రేషన్ దుకాణం ప్రారంభించాలి.

–గుర్రం సత్యం, రావిగూడెం సర్పంచ్

వారం రోజుల్లో ప్రారంభిస్తాం

మంజూరైన రేషన్ దుకాణాలను వారం రోజుల్లో ప్రారంభిస్తాం. మునుగోడు మండలంలోని నాలుగు, చండూరు మండలంలో రెండు దుకాణాలకు సంబంధించిన రేషన్ కార్డుల, యూనిట్ల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ఉన్నతాధికారులకు పంపాం. అధికారులు ఆమోదం తెలిపిన వెంటనే ఇన్‌చార్జ్‌లను కేటాయించి దుకాణాలు ప్రారంభింపజేస్తాం

–విజయ, డీటీఎస్ చండూరు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- 6న శ్రీ కమలాద్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం
- 11వ తేదీన ముగింపు వేడుకలు


శాపల్లి గ్రామ శివారులోని శ్రీ కమలాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం

నార్కట్‌పల్లి : మండలంలోని శాపల్లి గ్రామంలోగల కమలాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక అర్చకులు కారంపూడి నరసింహాచార్యులు, కారంపూడి రాకేశాచార్యులు తెలిపారు. నార్కట్‌పల్లి మండల కేంద్రానికి 12 కిమీ దూరంలో శాపల్లి గ్రామానికి దక్షిణ దిక్కున కొండపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వయంభువుడిగా వెలిశారు. ఈ ఆలయానికి ఉత్తర దిక్కున శివాలయం, ప్రత్యేక విష్ణు పుష్కరిణి ఉంది.

కార్యక్రమాలు ఇలా..

జనవరి 1వ తేదీన స్వామివారు కొండపైకి వెళ్లడం. 2న ప్రబంధ పారాయణం, 3న హనుమంతుడి సేవ, 4న అంకురార్పణ, 5న ధ్వజారోహణం, (గరుడముద్ద) 6న కల్యాణ మహోత్సవం, 7న అశ్వవాహన సేవ, 9న దివ్య విమాన రథోత్సవం, 10న శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవ, 11వ తేదీన శ్రీ స్వామివారు గ్రామంలోకి వేంచేయడం, రాత్రి శృంగార డోలోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నార్కట్‌పల్లి, కట్టంగూరు నుంచి బస్సు, ఆటో సౌకర్యం ఉన్నట్లు పేర్కొన్నారు.

భక్తులు అధిక సంఖ్యలో వస్తారు



ఎంతో విశిష్టత కలిగిన ఈ ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తులు జిల్లానుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. 6, 8వ తేదీల్లో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తాం.

-కారంపూడి నరసింహాచార్యులు, ఆలయ అనువంశిక అర్చకులు

రాష్ట్ర కమిటీ సభ్యుడిగా లింగస్వామి

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన కత్తుల లింగస్వామి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఖమ్మంలో గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర మహాసభల్లో తనను ఎన్నుకున్నారని లింగస్వామి ఆదివారం తెలిపారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు


పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో గల శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర ఆలయ మండపంలో ఆదివారం అన్నకుటోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో చతుర్వేద పండితుల సహకారంతో పంచోపనిషత్తులు, పంచసూక్తాది వేదమంత్రాలతో స్వామివార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్‌శర్మ, సుబ్బయ్యశాస్త్రి, మేడ ప్రభాకర్, గోపాల కృష్ణమూర్తి, గిరాజ నాగేశ్వరరావు, కృష్ణమాచారి పుల్లయ్య, తిరుమలనాథ్, తిరుమలనాథ్, భారతి, జ్యోతి, సింధూర, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూగంజ్‌లో అయ్యప్ప పడిపూజ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని పాతబస్తీ నెహ్రూగంజ్‌లో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్లు ఎడ్ల సైదులు, ఎం.దయాకర్, పున్న గణేశ్, వట్టిపల్లి శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, లకడాపురం వెంకటేశ్వర్లు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ చేయూత


సహాయం అందిస్తున్న లిటిల్ సోల్జర్స్ ప్రతినిధులు

నకిరేకల్ : పట్టణంలోని 1వ వార్డు పరిధి వడ్డెర కాలనీలో నిరుపేదమహిళ సంపంగి లింగమ్మ అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న నకిరేకల్‌లోని లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కృష్ణప్రసాద్ ఆదివారం ఆమెను పరామర్శించి రూ.8వేలు నగదు, 25 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. వారి వెంట కాలనీవాసి ముద్దం విజయ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

చిట్యాల : మండలంలోని ఆరెగూడెం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటుపై విద్యుత్ సర్వీస్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ తీగలు అతి తక్కువ ఎత్తులో ఉండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలలో ఏపుగా పెరిగిన చెట్ల మీదుగా విద్యుత్ తీగలు వెళుతుండడంతో గాలి దుమారం వచ్చినప్పుడు చెట్ల కొమ్మలు, ఆకులు తగిలి సర్వీస్ తీగలు ఒకదానికొకటి తాకి షార్ట్ సర్క్యూట్ అవుతోంది. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఆరెగూడెం పాఠశాలలో గేటు దగ్గర చెట్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

● ఎండిపోతున్న మొక్కలు



పురపాలక సంఘం ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి తెచ్చిన మొక్కలు పట్టణ ప్రకృతి వనాల్లో నిల్వ ఉంచడంతో అవి ఎండిపోతున్నాయి. నల్లగొండ పట్టణంలోని బండారు గార్డెన్‌కు సమీపంలోని బతుకమ్మ చెరువువద్ద ఉన్న పట్టణ ప్రకృతి వనం(ట్రీపార్కు)లో నిల్వ ఉంచిన వందలాది మొక్కలు ఎండిపోతున్నాయి. అయినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

3న టాలెంట్ టెస్ట్

దేవరకొండ : భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈనెల 3న సాంఘిక శాస్త్ర ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు డివిజన్ పరీక్ష కేంద్రం కన్వీనర్ బక్కయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండ విద్యా డివిజన్ పరిధిలోని 11మండలాల నుండి సుమారు 250మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి ఉదయం 10గంటల లోగా విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


నల్లగొండ : కేక్ కట్‌చేస్తున్న జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


నకిరేకల్ : నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


నకిరేకల్ : వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం


నల్లగొండ : జెడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు


మర్రిగూడ : మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ సురేందర్‌రెడ్డి




నల్లగొండ : వీటీ కాలనీ ఆలయంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు, శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


మునుగోడు : కేక్ కట్ చేస్తున్న చిన్నారులు


నల్లగొండ : కేక్ కట్ చేస్తున్న అదనపు ఎస్పీ


నల్లగొండ : వేడుకలు నిర్వహించుకుంటున్న అపార్ట్‌మెంట్‌వాసులు

నల్లగొండ : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాంకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చింతపల్లి చలపతి, గాదరి చంద్రయ్య, నర్సింహ, అండాలు, గోవర్ధన్, భద్రాచలం, చింత యాదయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే నివాసంలో

ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నివాసంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ

నల్లగొండ క్రైం : ఎస్పీ రెమా రాజేశ్వరి శనివారం రాత్రి నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో కేక్‌కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. పోలీస్ సిబ్బందితో కలిసి బెలూన్లు వదిలారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వరప్రసాద్, డీఎస్పీలు మొగిలయ్య, నర్సింహారెడ్డి, సీఐ శ్రీనివాస్, గోపి, ఆదిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఎస్‌టీసీ చర్చిలో

రామగిరి(నల్లగొండ) : సీఎస్ఎస్‌టీసీ చర్చిలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పంట ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్.క్రిష్టఫర్, పాస్టర్ డాక్టర్ శరత్, ఆనంద ప్రసాద్, టీఎస్. విలియమ్స్, ఎలిషా, మాణిక్యం, విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : నూతన సంవత్సర వేడుకలను నకిరేకల్ పట్టణవాసులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్‌గౌడ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేముల వీరేశం కేక్ కట్ చేశారు. వేడుకల్లో మాజీ ఎంపీపీ గుత్తా మంజుల, దైద సుధాకర్, యానాల లింగారెడ్డి, గాదగోని కొండయ్య, మట్టిపల్లి వీరు, కొండ వెంకన్న, చెవుగోని శ్రీను, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నకిరేకల్‌లోని శ్రీ ఐశ్వర సాయి మందిరంలో నూతన సంవత్సరం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్, కౌన్సిలర్ దైద స్వప్న పూజలు నిర్వహిచారు.

కేతేపల్లి : మండలవ్యాప్తంగా ప్రజలు ఆదివారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఆలయాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక జపమాలమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు తమ ఇళ్ల ఎదుట ముగ్గులు వేశారు.


కట్టంగూర్ : ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ బలరాములు

కట్టంగూర్ : నూతన సంవత్సర వేడుకలను మండల వ్యాప్తంగా ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నార్కట్‌పల్లిలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు మండల ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, వైస్ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌పోగుల నర్సిహ, ఎంపీటీసీ పాలడుగు హరికృష్ణ, సర్పంచ్‌లు గుర్రం సైదులు, వడ్డె సైదిరెడ్డి, పరుశురాములు, పుట్ట వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మునుగోడు : మండలవ్యాప్తంగా ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ఎదుట ముగ్గులు వేశారు. ప్రజలు ఉదయాన్నే గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎస్పీ రెమా రాజేశ్వరిలకు శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీటీసీ పాశం

మర్రిగూడ : నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డిని, ఎస్పీ రెమా రాజేశ్వరిలను ఆదివారం నల్లగొండలో జిల్లా ఫైనాన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పందుల పాండు, ఎదుదొడ్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శాలిగౌరారం : మండలంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మార్కెట్ కాలనీకి చెందిన మహిళా కూలీలు పంటపొలాల వద్ద ఉదయం కేక్‌లు కట్‌చేసి వేడుకలు నిర్వహించుకున్నారు.


నల్లగొండ : పోలీస్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ రెమా రాజేశ్వరి



నల్లగొండ : సెంటినరీ సెల్ఫ్‌సపోర్టింగ్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో..